విద్య, వైద్య రంగాలకు పెద్దపీట

ఎమ్మెల్యే నవాజ్ బాషా



ప్రశాంత్ నగర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నవాజ్ బాషా

మదనపల్లె: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేశారని ఎమ్మెల్యే నవాజ్‌బాషా పేర్కొన్నారు. మదనపల్లె మున్సిపాలిటీలోని 9వ వార్డు బర్మా వీధి, 30వ వార్డు ప్రశాంత్ నగర్ సచివాలయాల పరిధిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన ఎమ్మెల్యే నవాజ్‌బాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా చలపతికి కౌన్సిలర్లు పాల్ చంద్రశేఖర్, సరిత, బాలగంగాధరరెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వైద్య శిబిరాల్లో అందిస్తున్న సేవలపై ఎమ్మెల్యే ప్రజలను అడిగి తెలుసుకున్నారు. బీపీ, షుగర్ పరీక్షలు చేశారా..? మందులు ఉచితంగా పంపిణీ చేశారా?, డాక్టర్లు బాగా చూస్తున్నారా? అని విచారించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... జగనన్న విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రుల రూపురేఖలు మార్చారన్నారు. వైఎస్సార్ విలేజ్, అర్బన్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుతో పల్లెల్లో, పట్టణాల్లో నాణ్యమైన వైద్యసేవలందించేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్, 104 వాహన సేవలతో గ్రామీణులకు వైద్యంపై భరోసా దక్కిందన్నారు. మరో ఆరు నెలల్లో ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో ప్రతిపక్షాలు మాయమాటలు చెప్పి మోసగించేందుకు ముందుకు వస్తున్నాయన్నారు. ప్రజలు తమకు జరిగిన మంచిని మరచిపోకుండా వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, ఏఈ బండపల్లి శిరీష, కౌన్సిలర్లు వసీం, మేస్త్రీ శ్రీనివాసులు, ఎస్వీ.రమణ, రేణుక, సుగుణ, వైఎస్సార్ సీపీ నాయకులు గుండ్లూరురఫీ, షరీఫ్, రాయల్‌రవీంద్ర, ఇస్మాయిల్, బావాజీ తదితరులు పాల్గొన్నారు.

రామరాజ్యంలా జగనన్న పాలన

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన రామరాజ్యాన్ని తలపిస్తోందని ఎమ్మెల్యే నవాజ్ బాషా అన్నారు. మండలంలోని కొత్తవారిపల్లె పంచాయతీ, కొత్తవారిపల్లె–2 దుబ్బిగానిపల్లె పంచాయతీ యనములవారిపల్లెలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. స్థానికులు పలు సమస్యలు తెలియజేయగా వాటిని పరిష్కరించాలని అక్కడే అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... రామరాజ్యంలో ప్రజలు సంతోషంగా ఉండేవారని, ఏ కష్టం వచ్చినా రాముడు అన్నీ తానై ప్రజలకు అండగా ఉండేవారన్నారు. ప్రస్తుతం జగనన్న పాలనలో ప్రజలు సంతోషంగా ఉండటంతో పాటు ఆర్థికాభివృద్ధి చెందుతున్నారన్నారు. మేనిఫెస్టో హామీలన్నింటినీ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారన్నారు. టీడీపీ నాయకులకు జగనన్న పాలనలో అందరితో సమానంగా లక్షల రూపాయల లబ్ధి కలిగిందన్నారు. మంచి జరిగి ఉంటే జగనన్నకు ఓటువేయమని అడుగుతున్నామని, ఈ విధంగా అడిగే ధైర్యం ప్రజలను మోసం చేసిన టీడీపీకి లేదన్నారు. సర్పంచ్ బోర్‌వెల్ మహేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జి.వెంకటరమణ, డైరెక్టర్ తట్టి శ్రీనివాసులురెడ్డి, ప్రియాంక, సుధాకర్, వెలుగు చంద్ర, మండల కన్వీనర్ దండుకరుణాకర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ నాగరాజ పాల్గొన్నారు.

మంచిని ప్రజలకు చెప్పండి

నిమ్మనపల్లి: నాలుగున్నరేళ్ల పాలనలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు చేసిన మంచిని క్షేత్రస్థాయిలో ప్రజల వివరించాల్సిన బాధ్యత వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లదేనని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. నిమ్మనపల్లె రెవెన్యూ కార్యాలయం వద్ద గురువారం సన్నద్ధత సమావేశం నిర్వహించారు. సన్నద్ధతా సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా లంచాలు లేని పారదర్శక పాలన గ్రామాల్లోకి తీసుకెళ్లి సుపరిపాలన అందించారన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి రావాలని కలలు కంటున్న టీడీపీ, జనసేన కుట్రలను ప్రజా క్షేత్రంలో ఎండగట్టాలన్నారు. వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సదాశివరెడ్డి, నరసింహులు, జింకాచలపతి, రెడ్డిశేఖర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, తట్టిశ్రీనివాసులురెడ్డి, రెడ్డిశివకృష్ణ, సుబ్రహ్మణ్యం, చంద్రాయుడు, మహదేవరెడ్డి, వరలక్ష్మి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం



మాట్లాడుతున్న ఎంపీపీ దస్తగిరి

కురబలకోట: పల్లెల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని ఎంపీపీ బి.దస్తగిరి అన్నారు. స్థానిక మండల పరిషత్ మీటింగ్ హాల్‌లో గురువారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ దస్తగిరి మాట్లాడుతూ మండలంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సాయంతో అభివృద్ధి పనులు పుష్కలంగా జరుగుతున్నాయన్నారు. మట్లివారిపల్లె, ఎర్రమద్దివారిపల్లె మీదుగా ఆర్టీసీ సర్వీసు నడపడంలేదని చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. త్వరలో బస్సు నడుపుతామని అధికారులు తెలిపారు. గతంలో పేదలు కట్టుకున్న ఇందిరమ్మ ఇళ్లు శిథిలమయ్యాయని, కొత్త కాలనీలో పేదలకు ఇళ్లు మంజూరు చేయాలని కనసానివారిపల్లె సర్పంచి ఆర్కే. కృష్ణారెడ్డి కోరారు. దరఖాస్తు చేసుకుంటే అర్హులకు ఇళ్లు మంజూరు చేస్తామన్నారు.

శివ, పార్వతుల కళ్యాణోత్సవం



కళ్యాణోత్సవం నిర్వహిస్తున్న పండితులు

పెద్దతిప్పసముద్రం: స్థానిక పార్వతీ సమేత విరూపాక్షేశ్వరస్వామి ఆలయంలో గురువారం శివ, పార్వతుల కళ్యాణోత్సవం వైభవంగా జరిగింది. శివాలయం సేవకులు పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో వేద పండితులు కన్నాస్వామి, మణికంఠ పూజలు చేసి భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

బాల్య వివాహాల చట్టంపై అవగాహన



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీడీఓ

కలకడ: బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ పరమేశ్వరరెడ్డి, తహసీల్దారు ప్రదీప్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల, గ్రామస్థాయి కమిటీల సమావేశంలో వారు మాట్లాడుతూ బాల్య వివాహాల చట్టం –2006, అమలయ్యే శిక్షలు, నిరోధించే అధికారులు, చట్టాలు, సమాచార సేకరణపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సిటీ స్వామి, ఎంఈఓ మునీంద్ర నాయక్, ఏపీఎం రమేష్ పాల్గొన్నారు.

ఉత్తమ విద్యతో ఉన్నత శిఖరాలు



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ పవన్‌కళ్యాణ్

కలకడ: విద్యార్థులు ఉత్తమ విద్య అభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కల్యాణ్ పౌండేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ పవన్‌కళ్యాణ్ పేర్కొన్నారు. మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో 8, 9, 10, ఇంటర్మీడియట్ విద్యార్థినులకు గురువారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన 20మందికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అనిత, సుబ్రహ్మణ్యం, సభ్యులు అశోక్ కుమార్, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

పరుగు పందెంలో విద్యార్థిని ప్రతిభ



కె.పవిత్ర

ములకలచెరువు: తంబళ్లపల్లె నియోజకవర్గ స్థాయిలో జరిగిన పరుగు పందెంలో ములకలచెరువు ఎస్వీవీబీ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని పవిత్ర 200 మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ చూపి ద్వితీయ స్థానం సాధించారు. పెద్ద ఎత్తున జరిగిన ఈ పోటీల్లో వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరుకాగా పవిత్ర రాణించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

మా గ్రామాన్ని కరవు ప్రాంతంగా ప్రకటించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

ములకలచెరువు: ములకలచెరువు మండలాన్ని కరవు ప్రాంతంగా ప్రకటించాలని సీపీఐ నాయకులు అంజనప్ప, నాయుడు, నారాయణకోరారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట గురువారం నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూములకలచెరువు మండలాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు.

రైతుల్లో ఆనందం

పెద్దతిప్పసముద్రం: కరవు మండలాల జాబితాలో పెద్దతిప్పసముద్రం మండలానికి చోటు కల్పించడం హర్షణీయమని ఎంపీపీ మహమూద్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గణపతిరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ డ్రిప్ రమణ అన్నారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి చొరవతో నియోజకవర్గంలోనే ఐదు ప్రాంతాలను కరవు మండలాలుగా ప్రకటించేందుకు ఎమ్మెల్యే కృషి చేయడం అభినందనీయమని అన్నారు.

మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు ఊరట

- విద్యార్థుల సంఖ్యను బట్టి 5 నుంచి 11 రకాల వస్తువులు
- ప్రభుత్వ స్కూళ్ల బలోపేతానికి సర్కారు ముందడుగు



ప్రభుత్వం ద్వారా మంజూరైన నాణ్యమైన స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలు

పెద్దతిప్పసముద్రం: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీల కష్టాలకు ఏపీ సర్కారు ఊరటనిచ్చింది. ఏళ్ల నాటి సిల్వర్ పాత్రలతో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రభుత్వం అత్యంత నాణ్యతతో కూడిన స్టెయిన్ లెస్ స్టీల్ పాత్రలు మంజూరు చేసింది. మెనూ ప్రకారం సరిపడే పాత్రలు రావడంతో వంట నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- అన్నమయ్య జిల్లాలో మొత్తం 2150 ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలు ఉండగా ఇందులో 2019 పాఠశాలలకు ప్రభుత్వం వంట పాత్రలు అందజేసింది. మిగిలిన 131 బడులకు ఇస్కాన్ ద్వారా పంపిణీ చేస్తున్నారు. చదువుకునే పేద విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం ప్రవేశపెట్టింది. 13ఏళ్ల కిందట వంట తయారీకి అవసరమైన పాత్రలను అందజేసినా.. అప్పటి టీడీపీ ప్రభుత్వం వాటి గురించి పట్టించుకోలేదు. నిర్వాహకులు అరకొర పాత్రలతోనే వంట చేస్తున్నారు. కొన్ని స్కూళ్ళలో వంట పాత్రలే లేకపోవడంతో నిర్వాహకులే సమకూర్చుకున్నారు. ఈ నేపథ్యంలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశ్యంతో జగనన్న గోరు ముద్ద పథకం అమలు చేస్తున్నారు. మెనూపై దృష్టి సారించి రాగిజావ చేర్చారు. తాజాగా జిల్లా కేంద్రం నుంచి మండలాలకు నాణ్యమైన స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలు సరఫరా చేశారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా 5 నుంచి 11 రకాల వస్తువులు మంజూరు చేశారు. ఎంఈఓల ఆధ్వర్యంలో వాటిని భద్రపరిచారు. మండల కేంద్రాల్లో ఈ వంట పాత్రలను ఎండీయూ వాహనాల ద్వారా స్కూళ్లకు చేర్చేందుకు విద్యాశాఖ సమాయత్తం అవుతున్నారు. ఇందుకు రవాణా బిల్లులు కూడా ప్రభుత్వం మంజూరు చేసింది.

2019 పాఠశాలలకు పాత్రలు మంజూరు



ప్రభుత్వ పాఠశాలల్లో భోజనం తయారీకి అవసరమయ్యే నాణ్యమైన స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలను ప్రభుత్వం పంపిణీ చేసింది. మండలాలవారీగా వాటిని ఎంఈఓలకు అందజేశాం. కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడుల్లో అన్ని వసతులతో సౌకర్యాలు ఉండటంతో విద్యార్థుల సంఖ్య పెరిగింది. కొన్నిచోట్ల వంట పాత్రలు సరిపడక నిర్వాహకులు ఇబ్బంది పడ్డారు. అవసరాలను గుర్తించి మంచి నాణ్యమైన పాత్రలు అందించడం హర్షించదగ్గ విషయం. – శ్రీరాం పురుషోత్తం. జిల్లా విద్యాశాఖాధికారి, అన్నమయ్య జిల్లా

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తాం

పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



వరపనవారిపల్లెలో ప్రభుత్వ పథకాలపై వివరిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

గుర్రంకొండ: అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని నడిమి కండ్రిగ పంచాయతీలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో అభివృద్ధి పరుగు తీస్తోందన్నారు. గెరికుంటపల్లెలో మురుగు కాలువలు నిర్మించాలని, సీసీ రోడ్లు వేసి, విద్యుద్దీపాలు ఏర్పాటుచేయాలని ప్రజలు కోరారు. సదరన్ సర్టిఫికెట్ ఇప్పించి తనకు వికలాంగుల పింఛన్ మంజూరు చేయాలని, హరి ఎమ్మెల్యేను కోరగా.. వెంటనే ఇప్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్బీకే చైర్మన్ జయచంద్రారెడ్డి, సచివాలయల కన్వీనర్ నాగేంద్ర, కందుల గుణశేఖర్, అప్పల్ల, వైస్ ఎంపీపీ కరుణాకర్, జమీర్, ప్రకాష్‌రెడ్డి, బాబయ్య, సుధీర్‌రెడ్డి, సర్పంచులు సుబ్బమ్మ, రాధమ్మ, మస్తాన్‌రెడ్డి, నాయకులు జ్యోతిరెడ్డి, నక్కామధు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

కలికిరి: మండలంలోని అద్దవారిపల్లి సచివాలయం పరిధిలో శుక్రవారం జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి పీలేరు ఎమ్మెల్యే చింతలరామచంద్రారెడ్డి హాజరవుతారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్‌రెడ్డి తెలిపారు. పంచాయతీ పరిధిలోని గుంటివీరన్నపల్లి, కురవపల్లి, గుండ్లూరు పరిధిలోని గల్లావారిపల్లిలో ఎమ్మెల్యే పర్యటిస్తారని తెలిపారు.

పల్లెల్లో అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దాం



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ వెంకటరమణ

వాల్మీకిపురం: గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలను గుర్తించి చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ వెంకటరమణ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం జరిపారు. వైస్ ఎంపీపీ మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వస్తున్న సమస్యలను పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అక్కడిక్కడే పరిష్కరిస్తున్నారన్నారు. ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు ఇస్తున్నారని పేర్కొన్నారు. జ్వరాలు ప్రబలకుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. జాబ్‌మేళా ద్వారా 208 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. వాల్మీకిపురం నుంచి రాయచోటి, నిమ్మనపల్లికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు ఫిరోజ్ ఖాన్, జడ్పీటీసీ నిర్మల, సర్పంచ్ గంగులమ్మ, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ నరసింహులు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లంకి నరసింహులు, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాల పంటలు సాగుచేయండి



సమావేశంలో మాట్లాడుతున్న మాధవీలత

మదనపల్లె సిటీ: చిరు ధాన్యాలైన రాగి, కొర్ర, అండుకొర్ర, సామ పంటలు సాగు చేయాలని వ్యవసాయశాఖ ఏడీ దీక్షాకుమారి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం రైతు భరోసా కేంద్రం సిబ్బందికి సాంకేతిక, సామర్థ్య పెంపు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రబీ పంటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. పంటల సాగులో విత్తన మోతాదు, మొక్కల సాంద్రత, కలుపు నివారణ, సమగ్ర పంట యాజమాన్యం గురించి శాస్త్రవేత్తలు మాధవీలత, సోమశేఖర్ తెలిపారు. జిల్లా వనరుల కేంద్రం సావిత్రి, డీడీఏ ఎం.వి.శ్రీకాంత్ వరి, వేరుశనగలో మేలైన యాజమాన్య పద్ధతులను వివరించారు. అనంతరం ఈ క్రాఫ్, ఖరీఫ్–2023, ఫిజికల్ అక్నాలెడ్జ్‌మెంట్స్ వితరణ, మట్టి నమూనాల సేకరణ, ఎరువుల ఇండెంట్స్, సేల్స్, డ్యాష్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఓలు నాగప్రసాద్, మురళీమోహన్, మోహన్‌కుమార్, ఝాన్సీలక్ష్మి, ఆర్‌బీకె సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కలికిరిలో జగనన్నకు చెబుదాం

కలికిరి: కలికిరి మార్కెట్ యార్డు ఆవరణలో శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ గంగయ్య తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను విన్నవించుకోవచ్చన్నారు. కార్యక్రమానికి కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హాజరవుతారని, తమ సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లవచ్చునని ఆయన తెలిపారు.

ఆలయాల పునర్నిర్మాణానికి శ్రీకారం



మార్కింగ్ ఇస్తున్న ఇంజినీరింగ్ అధికారులు

తంబళ్లపల్లె: మల్లయ్యకొండ ఆలయాన్ని పునర్నిర్మించేందుకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కృషితో నిధులు మంజూరయ్యాయి. దీంతో ఎండోమెంట్ ఇంజినీరింగ్ అధికారులు సతీష్, గంగయ్య గురువారం పనులకు మార్కింగ్ ఇచ్చారు. కొండ కింద ఆంజనేయ, వినాయక, ఎలుగు మల్లమ్మ, కొండపై గౌరీదేవి ఆలయాల పునర్నిర్మాణం రాబోయే మహాశివరాత్రి రోజుకు పూర్తి చేస్తామని తెలిపారు. ఇందుకు రూ.25 లక్షల నిధులు అవసరమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మల్లయ్యకొండ చైర్మన్ మల్‌రెడ్డి, ఈవో రమణ, వైస్ఎంపీపీ కరీమ్, రామూర్తి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సోపానాలు సచివాలయాలు

కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



ఆర్బీకే ప్రారంభోత్సవం అనంతరం కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

గాలివీడు : అభివృద్ధికి సోపానాలు గ్రామ, వార్డు సచివాలయాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గోరాన్‌చెరువు గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, డిజిటల్ లైబ్రరీ, జగనన్న పాల వెల్లువ భవనాల సముదాయం, నూలివీడులో రైతు గోడౌన్, పందికుంటలో గ్రామ సచివాలయం, గాలివీడులో రైతు భరోసా కేంద్రం భవనాలను ప్రారంభించారు. మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయం వ్యవస్థ చారిత్రాత్మకంగా నిలుస్తున్నాయన్నారు. ప్రజల ముంగిటకే సేవలు అందిస్తూ భరోసానిస్తున్నాయన్నారు. సచివాలయం అధికారులు, సిబ్బంది, వలంటీర్లు చిత్తశుద్ధితో పని చేసి సమస్యలు పరిష్కరించి ప్రజల మన్ననలను పొందాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఆసరా కలుగుతుందని, రైతులకు అన్ని సేవలు వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలలో లభిస్తున్నాయన్నారు. ఇందులో కియోస్క్, టీవీ, లైబ్రరీలు ఉంటాయని, రైతన్నకు కావాల్సిన సమాచారం పొందవచ్చునన్నారు. విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులను ఇక్కడి నుండే ఆర్డర్ చేసుకున్న 48 గంటల్లో పొందవచ్చునన్నారు. ఎంత సాగు వివరాలు నమోదును రైతు భరోసా కేంద్రాల ద్వారా నమోదు చేసుకోవాలన్నారు.

- గోరాన్‌చెరువు గ్రామంలోని వైఎస్సార్ విలేజ్ క్లినిక్ నూతన భవనం ప్రారంభంలో మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు గ్రామంలోనే వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ప్రతి 2,500 జనాభాకు వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈ క్లినిక్‌లో 12 రకాల వైద్య సేవలు అందించడంతో పాటు 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. 65 రకాల మందులతో పాటు 67 రకాల బేసిక్ మెడికల్ ఎక్విప్‌మెంట్ అందుబాటులో ఉంటుందన్నారు. రూ17.57లక్షలతో నిర్మించిన డిజిటల్ లైబ్రరీ ద్వారా యువత, ఉద్యోగులకు వరంగా డిజిటల్ లైబ్రరీలు మారుతున్నాయన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

రాయచోటి టౌన్ : జిల్లా స్థాయిలో విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు 13 మంది ఎంపికయ్యారు. వీరి అభినందన కార్యక్రమాన్ని మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శివకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గురువారం డిప్యూటీ డీఈఓ వరలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని వారిని అభినందించారు. టెన్నికాయిట్‌లో ఎస్.శ్రావణి, ఎస్. షామీర్, ఏ.నాగప్రణీత్‌రెడ్డి, పి. యాసిన్, కె.అరాఫత్, ఎస్.వెంకట శివకుమార్, వి.మహేంద్ర, వి.రంజిత్, శ్రీ పూజలు ఎంపికయ్యారు. అలాగే గత నెల 30న ప్రొద్దుటూరు మున్సిపల్ గ్రౌండ్‌లో నిర్వహించిన బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో డి. శివరాం, సి.అవినాష్, శ్రీపూజ, ఎస్.రుషీంద్రలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా పరిషత్ ఉర్దూ పాఠశాలలో కూడా జిల్లా క్రీడా పోటీలు నిర్వహించగా 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 12 మంది బాలికలు, 12 బాలురులు, అండర్ –14 వాలీబాల్ పోటీలకు ఎంపిక నిర్వహించగా వీరు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు.

క్లుప్తంగా

తాళిబొట్టు బహుకరణ



బంగారు తాళిబొట్లు అందజేస్తున్న దాతలు

పీలేరు: పీలేరు ప్రభుత్వాస్పత్రి వద్ద వెలసిన రౌద్రాల అంకాలమ్మ అమ్మవారికి పీలేరు పట్టణానికి చెందిన జ్యువెలర్స్ యజమాని వెంకటేష్ రెండు బంగారు తాళిబొట్లు బహూకరించారు. మూడు రోజుల క్రితం ఆలయంలో చోరీ జరిగి దుండగులు తాళిబొట్లు అపహరించుకెళ్లారు. దీంతో దాత వెంకటేష్ స్పందించి నూతన తాళిబొట్లు ఆలయ చైర్మన్ భాస్కర్‌రెడ్డికి గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, నాగమణి, ప్రణీత్, సింధు, తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర చైతన్య సభకు ఏర్పాట్లు



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న నాయకులు

పీలేరు రూరల్: పీలేరులో ఈ నెల 8న నిర్వహించనున్న వడ్డెర చైతన్య సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏఎంసీ చైర్మన్ ఎల్లయ్య, వేర్ హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజమ్మ పర్యవేక్షణలో స్థానిక వేర్ హౌస్ గోదాము ఆవరణంతా జేసీబీతో చదును చేయించారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గం నలమూలల నుంచి పెద్ద ఎత్తున వడ్డెరలు సభకు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు రమణ, బాబు, హరిప్రసాద్ పాల్గొన్నారు.

కేవీపల్లె: ఈ నెల 8న పీలేరు పట్టణంలోని వేర్ హౌస్ గోడౌన్ ప్రాంగణంలో నిర్వహించే వడ్డెర చైతన్య సభను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల కన్వీనర్ గజ్జెల శీన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య పిలుపునిచ్చారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ వేర్‌హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజమ్మ, ఎంపీటీసీ ఈశ్వరయ్య, బాలరాజు, నాయకులు నాగేశ్వర, హరిప్రసాద్, రెడ్డెప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణ



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పీలేరు: ఐరన్ సుక్రోజ్ సూదిమందుతో గర్భిణులలో రక్తహీనత నివారించ వచ్చునని డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు ఆయన అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రక్తహీనత అవగాహన లోపంతో కూడిన ఓ సామాజిక సమస్య అన్నారు. నెలలు కాకుండానే కాన్పులు, తక్కువ బరువుతో శిశుజనన, మాత శిశు మరణాలు జరిగే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ కుసుమ, స్టాఫ్ నర్స్ శిరీష, సునీత, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బీమా సొమ్ము అందజేత



సొమ్ము అందజేస్తున్న సుబ్బిరెడ్డి, నాగార్జునరెడ్డి

పెద్దతిప్పసముద్రం: మండలంలోని పోతుపేట పంచాయతీ పిడుంవారిపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు తగాది గంగులప్ప(52) బుధవారం అకస్మికంగా మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న, సర్పంచులు బుచ్చిగారి సుబ్బిరెడ్డి, కళావతి, ఎంపీటీసీ నాగార్జునరెడ్డి, కోట్లోని వెంకటరెడ్డి, తదితరులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్ బీమా కింద రూ.10 వేల నగదు అందజేశారు.

సిబ్బంది నియామకం

పెద్దతిప్పసముద్రం: స్థానిక తహశీల్దారు కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా మహేష్ బాధ్యతలు చేపట్టినట్లు తహశీల్దారు విద్యాసాగర్ తెలిపారు. ఈయన గతంలో పెద్దమండ్యం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా ఐదేళ్ళ పాటు పనిచేశారు. గ్రూప్–4 పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి జూనియర్ అసిస్టెంట్‌గా నియమితులవడంతో సదరు ఉద్యోగానికి రాజీనామా చేసి పెద్దతిప్పసముద్రంలో బాధ్యతలు చేపట్టారు.

ఉపాధి పనుల తనిఖీ

పెద్దతిప్పసముద్రం: మండలంలో ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనులను ఎస్సార్పీ నేతృత్వంలో ఆరుగురు డీఆర్పీలు, విలేజ్ అసిస్టెంట్లు గురువారం తనిఖీ చేశారు. గత కొద్ది రోజులుగా వారు పల్లె బాట పట్టి తనిఖీలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం గ్రామంలో చాటింపు వేసి ప్రజల సమక్షంలో సచివాలయం వద్ద గ్రామసభ నిర్వహించి జరిగిన పనులు, ఖర్చు వివరాలను చదివి వినిపిస్తున్నారు. కొందరు తూతూ మంత్రంగా తనిఖీలు చేసి మమ అనిపిస్తున్నారని గ్రామస్థులు చెబుతున్నారు.